

హైదరాబాద్ వార్త

# చలిచలిగా..

**రాత్రి ఎనిమిది తర్వాత పెరుగుతున్న తీవ్రత**

**అర్ధరాత్రి వేళ వణుకుతున్న వాహనదారులు**

**17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు**

హైదరాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త : చలి కాలం మొదలవడంతో నగరంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదవుతున్నప్పటికీ రాత్రి మాత్రం చలి గజగజ వణికిస్తోంది. గతవారం రోజులుగా రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు భారీగా పతనమవుతున్నాయి. ఇదే స్థాయిలో కొనసాగితే పగటి ఉష్ణోగ్రతలు సైతం తగ్గుతాయని వాతావరణశాఖ అభిప్రాయపడుతోంది.

రాత్రి 8గంటల దాటిదంటే ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పడిపోతుండడంతో పలు ప్రాంతాల్లో చలితీవ్రత పెరుగుతోంది. అర్ధరాత్రి 12 గంటల తర్వాత చలి ఎక్కువవుతుండటంతో రోడ్డు పక్కన వ్యాపారాలు సాగించే చిరు వ్యాపారులు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు వణికిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలూ దీనికి ఓ కారణంగా చెప్పవచ్చు. ఆదివారం అత్యల్పంగా 17 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత క్రమంగా తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 6.30 గంటల వరకు చలి తగ్గకపోవడంతో ఆ సమయంలో రోడ్లపై జన సంచారం పలుచగానే ఉంటోంది. వాస్తవంగా ఏటా సెప్టెంబరు 20 నుంచే చలి ప్రారంభమై ఫిబ్రవరిలో వచ్చే శివరాత్రి పండగతో ముగుస్తుందని పెద్దలు చెబుతారు. అయితే గ్రేటర్‌లో మునుపెన్నడూలేని విధంగా ఈసారి వర్షాలు అధికంగా కురవడంతో చలికాలం కాస్త ఆలస్యంగానే ప్రారంభమైందనే చెప్పవచ్చు. వర్షకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత జూన్ 1 నుంచి ఆగస్టు 30 వరకు నగరంలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సెప్టెంబరు నుంచి అక్టోబరు వరకూ రోజూ నగరంలో ఎక్కడోచోట వర్షం పడుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలూ చలికి ఓ కారణంగా వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

# అందుబాటులోనే పూల ధరలు

- గుడిమల్కాపూర్ మార్కెట్‌లోదసరాతో పోలిస్తే తగ్గిన పూల ధరలు
- సువాసనతో నిండిపోయిన పూల మార్కెట్
- ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు పడ్డ ప్రజలు, వాహనదారులు











నార్సింగి, అక్టోబర్ 23 ప్రభాతవార్త : హిందువులు అత్యంత భక్తి, శ్రద్దల మధ్య జరుపుకునే అతిపెద్ద పండగలలో "దీపావళి" ఒకటి. ఈ పర్వదినాన ప్రజలు, వ్యాపారులంతా తమ తమ వ్యాపార సముదాయాలను రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి లక్ష్మీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కచ్చితంగా ప్రజలంతా పూలను కొనేందుకు ఎగబడుతుండడంతో పూలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగిపోయింది. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు తెలంగాణ నలు మూలల నుంచి శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం వరకు వందలాది లారీల పూలు గుడిమల్కాపూర్ మార్కెట్‌కు వచ్చాయి. గుడిమల్కాపూర్‌లోని ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌లో బంతి, చామంతి, గులాబి, కనకాంబరాల్లు, లిల్లి, మల్లె పువ్వులను రాశులుగా పోసి విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్ మొత్తం పూల సువాసనతో గుమగుమలాడుతోంది. గత మూడు రోజుల క్రితానికి ఇప్పటికీ ధరలు పెరిగినా దసరా పర్వదినంతో పోలిస్తే ఇప్పుడు(దీపావళి) సగం ధరకేఅమ్ముడుపోతున్నాయి. దీంతో అటు రైతులు, ఇటు వ్యాపారులు ధరలు పడిపోవడంతో ఉసూరుమంటున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచే పూలు వచ్చి ఉంటే మంచి ధరలు పలికేవని, ఇతర రాష్ట్రాల నుంచి పూలు పెద్ద సంఖ్యలో రావడం వలన ఆశించిన ధరలు రావడం లేదని వ్యాపారులు రైతులు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూలకు కేవలం పర్వదినాలు, శుభకార్యాల సమయంలోనే డిమాండ్ ఉంటుందని, సాధారణ రోజుల్లో ఎవరూ వీటిని పట్టించుకోరని, ఈ సమయాల్లోనైనా పూలను పండిస్తున్న రైతులు లబ్ధిపొందాలని అందరూ కోరుకోవాలని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఆదివారం గుడిమల్కాపూర్ లోని పూల మార్కెట్ వేలాది మంది వినియోగదారులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్ ముందున్న రోడ్డు వందలాది పూల వాహనాలు, వేలాది మంది వినియోగదారులతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీపావళి పర్వదినం సందర్భంగా పూల గుబాళింపుతో పాటు వేలాదిగా వచ్చిన వినియోగదారులతో గుడిమల్కాపూర్ ఇంద్రారెడ్డి పూల మార్కెట్ కిక్కిరిసిపోవడం గమనిస్తే పూలకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. శని, ఆదివారాలలో ఆశించిన ధరలు లేకు నష్టపోయామని, సోమవారం ధరలు కొంత పెరుగవచ్చని రైతులు, వ్యాపారులు ఆశగా ఎదిరి చూస్తున్నారు. వినియోగదారులు మాత్రం అందుబాటులోనే ధరలున్నాయని ఆనందపడుతున్నారు.

# టపాసుల మోత

**శ్రుతి మించొద్దు**

**జాగ్రత్తలు పాటిస్తేనే ప్రమోద దీపావళి**

**పర్యావరణ హితంతోనే ఆనందం, ఆరోగ్యం**

**45 డెసిబుల్స్ దాటితే హానికరం**



హైదరాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త : దివ్వెల పండుగ దీపావళిని శబ్ధ వాయు కాలుష్య రహితంగా జరుపుకొంటేనే ఆనందకరం. ఆరోగ్యప్రదమని సూచిస్తున్నారు పలువురు పర్యావరణ వేత్తలు. ఆకాశంలో మిరుమిట్లు గొలిపేలా వెలుగులు విరజిమ్మే బాణసంచా.. టపాసుల మోతలతో మహానగరం దద్దరిల్లడం ప్రతియేటా పరిపాటే.. కానీ టపాసుల మోత అవధులు మించితే చిన్నారులు, వృద్దులు, రోగులు, పెంపుడు జంతువుల మనుగడే ప్రశ్నార్థకం కానుంది. వాయు కాలుష్యంలో సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ మోతాదు కూడా భారీగా పెరిగి శ్వాసకోశ, కళ్ల సంబంధిత వ్యాధులు పెరిగే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా టపాసులు కాల్చినప్పుడు వెలువడే శబ్ధాలు నివాస ప్రాంతాల్లో 45 డెసిబుల్స్ (ధ్వనిని కొలిచే ప్రమాణం) మించరాదు. కానీ నగరంలో ధాం.. ధాం శబ్ధాలు ఏటా 90 డెసిబుల్స్‌కు మించి నమోదవుతుండడం పట్ల పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా అతిధ్వనులు చిన్నారులు, వృద్దులు, రోగులు, పెంపుడు జంతువుల్లో విపరిణామాలు సృష్టించడం తథ్యమంటున్నారు.

**వాయు కాలుష్యంతో ముప్పే..** టపాసులు కాల్చినప్పుడు వెలువడే పొగలో సల్ఫర్‌డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, ధూళి రేణువులు పర్యావరణంతో పాటు సిటీజన్ల ఊపిరితిత్తులకు తీవ్ర హాని కలిగిస్తాయి • సల్ఫర్ డై ఆక్సైడ్ క్యూబిక్ మీటరు గాలిలో 80 మైక్రోగ్రాములు మించరాదు. టఫాసులు అత్యధికంగా కాల్చినప్పుడు క్యూబిక్ మీటరు గాలిలో సల్ఫర్ డై ఆక్సైడ్ 450-500 మైక్రోగ్రాములకు చేరుకుంటుంది. దీంతో ఊపిరితిత్తులకు హాని కలుగుతుంది. బ్రాంకైటిస్ తీవ్రమైన దగ్గు తప్పదు • నైట్రోజన్ ఆక్సైడ్ పరిమితి క్యూబిక్ మీటరు గాలికి 80 మైక్రోగ్రాములు మించరాదు. టపాసులు అత్యధికంగా కాల్చినప్పుడు దీని మోతాదు క్యూబిక్ మీటరు గాలిలో 450-500 మైక్రోగ్రాముల వరకు పెరుగుతుంది. దీంతో కళ్లు ముక్కు మండుతాయి. శ్వాసకోశాలకు తీవ్ర చికాకు కలుగుతుంది • ధూళి రేణువులు క్యూబిక్ మీటరు గాలిలో 100 మైక్రోగ్రాములు మించరాదు. వీటి మొతాదు కూడా క్యూబిక్ మీటరు గాలిలో 300 మైక్రోగ్రాములు మించే పరిస్థితి తలెత్తడంతో తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు తథ్యం • 90 డెసిబుళ్లకు మించిన శబ్ధాలు విన్నప్పుడు కొందరికి తాత్కాలిక చెవుడు, మరికొందరికి దీర్ఘకాలిక చెవుడు వచ్చే ప్రమాదం ఉంది • చిన్నపిల్లల కర్ణభేరిలోని సూక్ష్మనాడులు దెబ్బతింటాయి. వృద్ధులకూ శాశ్వత చెవుడు వచ్చే ప్రమాద ఉంది. ఒకేచోట అత్యధిక ధ్వనిని ఇచ్చే టపాసులు కాల్చితే ప్రమాదం తప్పదు.

**విపరిణామాలు ఇలా..** గ్రేటర్‌లో నిత్యం సుమారు 800-1000 మంది చిన్నారులు జన్మిస్తున్నారు. నవజాత శిశువులు 90 డెసిబుల్స్ దాటిన శబ్దాలు వింటే వారిలో వినికిడి శక్తి కోల్పోతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. వారి గుండె కొట్టుకునే వేగం పెరిగి ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తడం తథ్యమంటున్నారు • కుక్క, పిల్లి లాంటి జంతువులు 50 డెసిబుల్స్ దాటిన శబ్ధాలను వింటే విపరీతంగా ప్రవర్తిస్తాయని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. కొన్నిసార్లు వాటి కర్ణభేరి బద్ధలయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. అతిధ్వనులు విన్న జంతువులు ఇంటి నుంచి పరుగెత్తి రోడ్ల ప్రమాదాల బారిన పడడం, కరవడం వంటిప్రవర్తన చూపుతాయని చెబుతున్నారు • రాకెట్లు, భూచక్రాల వంటివి కాల్చినప్పుడు పెంపుడు జంతువులకు తగిలి గాయలపాలవుతాయి. దీంతో అవి వణుకుడు బారినపడతాయి. ఈ గాయాలు సమీప భవిష్యత్తులో వాటికి పెనుముప్పుగా మారడం తథ్యం.

**పరిష్కారం ఇలా..** తక్కువ శబ్ధం వెదజల్లే చిచ్చుబుడ్లు, భూచక్రాలు, పెన్సిల్స్ వంటివి కాల్చాలి. అత్యధిక శబ్ధాలు వినిపించే ప్రాంతాల్లో ఈయర్ ప్లగ్‌లు వాడాలి. శబ్ధాలు కాకుండా వెలుగులు విరజిమ్మే మతాబులను ఎంపికచేసుకోవాలి • శబ్ధాలు కర్ణభేరికి సోకకుండా చెవుల్లో దూది పెట్టుకోవాలి • టపాసుల మోత శ్రుతి మించకుండా చూసేందుకు కాలనీ సంక్షేమ సంఘాలు ప్రయత్నించాలి.

## భర్తతో కలిసి సినిమాకు వెళ్లిన భార్య సినిమాహాల్‌లో అదృశ్యం



అదృశ్యమైన శైలజ (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, అక్టోబరు 23 ప్రభాతవార్త : భర్తతో కలిసి సినిమాకు వెళ్లిన భార్య సినిమా చూస్తుండగా, సీనిమా హాల్‌లో అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా హత్నూరు మండలం చందాపూర్ గ్రామానికి చెందిన ఎం.భాస్కర్‌రెడ్డి నగరంలో ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భాస్కర్‌రెడ్డికి గత మే 26వ తేదీన ఎం.శైలజ(27)తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కాగా ఈ నెల 21వ తేదీన సాయంత్రం భాస్కర్‌రెడ్డి, ఆయన భార్య శైలజను తీసుకొని కొత్తగూడలోని ఏఎంబి మాల్‌లో సీనిమాకు వచ్చాడు. సినిమా చూస్తుండగా సాయంత్రం 5.10 గంటలకు భార్య శైలజ వాష్‌రూమ్‌కు వెళ్లేందుకు హాల్ నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఎంతకూ శైలజ తిరిగి రాకపోవడంతో భాస్కర్‌రెడ్డి సినిమా హాల్ మొత్తం గాలించాడు. అక్కడ పనిచేస్తున్న మహిళా సిబ్బందితో వాష్‌రూమ్‌లో వెదికిం చినా శైలజ జాడ తెలియలేదు. శైలజ వద్ద సెల్‌ఫోన్ సైతం లేకపోవడంతో భాస్కర్‌రెడ్డి సినిమా హాల్ బయట వెదికినా, ఇంటికి వచ్చి వెదికినా, బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలి తం లేకపోయింది. దీంతో ఆదివారం భాస్కర్‌రెడ్డి తన భార్య అదృశ్యంపై గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్ట డంతో పాటు శైలజ కోసం ఎఎంబి మాల్ సిసిఫుటేజ్ ను పరిశీలిస్తున్నారు.

## దీపావళి పండగను ప్రతి ఒక్కరు సుఖ:సంతోషాల మధ్య జరుపుకోవాలి : డిప్యూటీ స్పీకర్ పద్మారావు



సికింద్రాబాద్, అక్టోబర్ 23 ప్రభాతవార్త : దీపావళి సందర్భంగా డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సికింద్రాబాద్ నియోజకవర్గం ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండగను ప్రతి ఒక్కరు సుఖ:సంతోషాల మధ్య జరుపు కోవాలని కోరారు. పిల్లలు, యువత దీపావళిని పురస్కరించుకొని బాణసంచ కాలుస్తుంటారని, ఇలాంటి సమయంలో తల్లితండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



## సదర్.. షహార్ ఖదర్

హైదరాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త : నగరంలో ఏటా నిర్వహించే సదర్ ఉత్సవంలో దున్నపోతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాయి. లక్షలాది రూపాయల విలువ చేసే వీటిని హరియాణా, పంజాబ్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చారు.దీపావళి మరుసటి రోజు నిర్వహించే సదర్‌తో పాటు ఈనెల 27న నారాయణగూడలో నిర్వహించే మహాసదర్ ఉత్సవాల వరకు వాటికి రోజు మర్ధన చేస్తూ, విన్యాసాలు చేయిస్తూ పాలు, కాజు, బాదం తదితర ప్రత్యేక ఆహారం అందించి సిద్ధం చేస్తున్నారు. ఆదివారం చెప్పల్‌బజార్, ముషీరాబాద్‌లో సన్నాహాలు చేస్తూ కనిపించిందిలా..

## సిఎం జగన్ తనపై కేసులను తప్పుదోవ పట్టించడానికే అమరావతి రైతులపై దాడులు

**అమరావతి బాధిత రైతాంగ పోరాట వేదిక**

చిక్కడపల్లి, అక్టోబరు 23 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో సిఎం జగన్మోహన్‌రెడ్డి తనపై అవినీతి ఆరోపణలను తప్పుదోవ పట్టించడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి అమరావతి రైతాంగంపై దాడులకు తెగబడుతున్నారని తెలంగాణ రాష్ట్రం, అమరావతి రాజధాని ఏరియా, ఆంప్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు బాధితర రైతాంగ పోరాటవేదిక అధినేత, న్యాయవాది తన్నీరు వెంకటేశ్వర్లు అన్నారు. అమరావతి నుంచి అరిసవెల్లి పాదయాత్రలో రైతులపై ఎపి రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు చేస్తున్న దాడికి నిరసనగా ఆదివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్రం, అమరావతి రాజధాని ఏరియా, ఆంప్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు బాధితర రైతాంగ పోరాటవేదిక ఆధ్వర్యంలో బాధితర రైతాంగ పోరాటవేదిక-సభ అమరావతి ఏరియా ప్రతినిధి ఆలూరు కోటయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తన్నీరు వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సందర్భంగా అమరావతి పరిరక్షణ సమితి సభ్యులు పాలడుగు వినీల, హైదరాబాద్ జేఏసీ సభ్యులు కొల్లి ప్రవీణ్, సీతారామయ్య తదితరులు రైతుల గోసపై ప్రసంగించారు. అమరావతి రైతులపై జరుగుతున్న దారుణాలను ఎపి ప్రభుత్వం చెబుతున్న అసత్యాలను, అమరావతి విశిష్ట గురించి తెలియజేసే ఈ పాదయాత్రను ఎపి ప్రభుత్వ దొంగలు, వైసీపీ బానిస పోలీసులు ఆపాలని చూడడం ప్రజాస్వామ్యంకు వ్యతిరేకం అని వక్తలు పేర్కొన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, ఇబ్బందులు పెట్టినా అరసవెల్లి వరకు వెళ్లడం, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజలకు తెలియజేస్తామన్నారు.

# మందుల మాయాజాలం..!

- అనర్హులు ఫార్మాసిస్టులుగా చలామని
- ఒకే లైసెన్సుపై రెండు మూడు షాపులు
- జనరిక్ మెడిసిన్స్‌కు బ్రాండెడ్ లేబుళ్లు
- అక్రమార్కులకు సహకరిస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు
- అందినకాడికి దండుకుంటూ తనిఖీలకు స్వస్తి
- కానరాని నిబంధనల అమలు

హైదరాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త : డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌లో ఇష్టారాజ్యంగా మారింది. ముడుపులు చెల్లిస్తే అన్ని పనులు సవ్యంగా సాగిపోతాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే మెడికల్ దుకాణాలు, బ్లడ్ బ్యాంకులు కొంతమంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు కల్పతరువుగా మారిపోయాయి. ప్రతి వారం పర్యవేక్షణ, శాంపిల్స్ సేకరణ, రెన్యువల్, ఫార్మాసిస్టుల నియామకాలు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. నగరంలో 15వేలకు పైగా మందుల దుకాణాలు ఉండగా ఇక్కడ 20 మంది డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ప్రతి 100 మందుల దుకాణాలకు ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. అంటే నగరంలో సుమారు 150 మంది అవసరం. దీంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల చేతిలో ఎక్కువ మందుల దుకాణాలు ఉండటంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కొందరు డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ల చేతిలో పైకం పడితే చాలు మెడికల్ దుకాణాలు, బ్లడ్ బ్యాంకుల నిర్వహణపై క్లీన్ సర్టిఫికెట్ ఇస్తారు. మెడికల్ దుకాణాలు, బ్లడ్ బ్యాంకులు, మందుల తాయారీ సంస్థల్లో ఎన్ని అవకతవలు చోటు చేసుకుంటున్నా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ దుకాణం, బ్లడ్ బ్యాంకులు, మందుల తయారీ సంస్థలు ఏర్పాటు నుంచి, ప్రతి వారం పర్యవేక్షణ, రెన్యువల్ అన్నీ వారే పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇదే వారికి కల్పతరువుగా మారింది. మెడికల్ దుకాణాల లైసెన్స్ పరిశీలించడం, మందుల శాంపిల్స్ ఏ మేరకు మందుల నిల్వ ఉంటుంది, మందుల గడువు, అమ్మకపు బిల్లు తదితర అంశాలను ఇన్స్‌స్పెక్టర్లు పరిశీలించాల్సి ఉంటుంది. కానీ గ్రేటర్ పరిధిలో నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వీటిని నిర్వహిస్తున్నారు.

వాస్తవానికి ఉత్పత్తి సంస్థల్లో నాణ్యతా ప్రమాణాలపై అధికారులు తనిఖీలు చేయాలి. ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన లేబరేటరీల్లో వాటిని పరీక్షించాలి. ఫార్మసిస్టులకూ మందులను నిల్వ చేయడంపై శిక్షణ ఇవ్వాలి. అలాగే ఫార్మసిస్టుల సమక్షంలోనే ముందులు విక్రయించాలి. కానీనగరంలో 50 శాతం మందులత దుకాణాల్లో ఫార్మసిస్టులు లేరని అధికార వర్గాలే అంటున్నాయి. అలాగే డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా షెడ్యూల్ హెచ్, హెచ్1 మందులను అమ్మడానికి వీలు లేదు. ఆ మేరకు రికార్డులు కూడా నిర్వహించాలి. బిల్లులత నిర్వహణ ఉండాలి. గడువు ముగిసిన మందులను షాపులోక్ల ఉంచరాదు. డ్రగ్స్ కంపెనీల ప్రతినిధులు ఇచ్చే శాంపిల్ మందులు, ప్రభుత్వాసుపత్రుల్లో సరఫరా చేసే మందులను అమ్మకూడదు. కానీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల దందా, వారి కొరత కారణంగా చాలా మెడికల్ దుకాణాల్లో ఆ నిబంధనలు అమలు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఆజమాయిషీ చేసే డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్టేషన్ (డీసీఏ) డీఐల నుంచి అందే పర్సంటేజీలతో తరిస్తుంది. ఫలితంగా ప్రజారోగ్యాన్ని, భద్రతను గాలికొదిలేస్తున్నారు. మామూళ్ళు అందితే చాలు..శాంపిళ్ళ సేకరణ, ధరల నియంత్రణ మనకు ఎందుకులే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు.



గ్రేటర్ పరిధిలో సుమారు 15వేల మెడికల్ దుకాణాలున్నా..వాటిలో కొన్ని రెన్యువల్ చేయకుండా, మరికొన్ని లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్నారు. నిజానికి ప్రతి ఐదేళ్ళకోసారి మందుల షాపులు, లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలి. రెన్యువల్ కోసం డీసీఏకు దరఖాస్తు చేసుకోవాలి. కొంత మంది రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాటికి అనుమతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్టు-1940 ప్రకారం లైసెన్సు రెన్యువల్ జరిగేంత వరకు షాపులను తెరవకూడదు. కానీ దరఖాస్తు చేసుకున్నప్పుడు డీసీఏ వారు ఇచ్చే అక్‌నాలెడ్జ్‌మెంట్ రిసిప్టుపైనే దాదాపు మెడికల్ దుకాణాలు చెలామణి అవుతున్నాయి.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్‌డ్ డ్రగ్స్ స్టోర్‌లలో రిజిస్టర్ ఫార్మసిస్టుల ద్వారానే మందులను అమ్మించాలి. నగరంలో అత్యధిక మెడికల్ దుకాణాల్లో అసలు ఫార్మాసిస్టులే ఉండడం లేదని, కేవలం పదో తరగతి, ఇంటర్ చదివిన వారితోనే మందులను విక్రయింపజేస్తున్నారని ఆరోపణలున్నాయి. పర్యవేక్షణకు వచ్చిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు కొంత మొత్తం ముట్టజెపితే ఈ విషయం పట్టించుకోవడంలేదని ఫిర్యాదులున్నాయి. కొన్ని మెడికల్ దుకాణాల్లో నకిలీ, నాసిరకం మందుల విక్రయాలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. అయినా డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఒక డ్రగ్ ఇన్స్‌స్పెక్టర్ నెలలో **10** మందుల శాంపిళ్ళను సేకరించి ల్యాబ్‌లకు పంపాలి. పరీక్షల్లో నకిలీ, నాసిరకం మందులని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అసలు శాంపిళ్ళనే సేకరించడం లేదన్న ఆరోపణలున్నాయి.

## కంటోన్మెంట్‌పై సిఎం కేసీఆర్ సవతి ప్రేమ

**కంటోన్మెంట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోఉన్న కంటోన్మెంట్ బోర్డు ప్రజలపై ముఖ్య మంత్రి కేసీఆర్ సవతి ప్రేమ చూపుతున్నాడని కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. బిజెపి బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా రామక్రిష్ణ 6,7 వార్డులలోని కిరణ్ ఎన్‌క్లేవ్, మారుతీ నగర్, బంజారా కాలనీ, రవి కాలనీ ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కె. మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎకైక ఎస్సీ రిజర్వుడ్ కంటోన్మెంట్‌పై సిఎం కేసీఆర్ సవతి ప్రేమ చూపుతున్నారన్నారు. కనీసం మంచినీరు కూడా సరఫరా చేయలేక పోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి టీ.పి.టి. సర్వీస్ టాక్స్‌లపై 100 కోట్లు రావాల్సి ఉందన్నారు. కంటోన్మెంట్ దేశాభివృద్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అనేక మార్పులు తెస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బంజారా నగర్ పార్కులో వేద మంత్రాలతో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బంజారా నగర్ హౌజ్ ఓనర్స్‌అసోసియేషన్ ప్రతినిధులు వై.వి.రావ్, ఎం.డి. అస్లామ్, ఆంథోనీ, తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న రామక్రిష్ణ తదితరులు

## కూచిపూడి నృత్యం భారతీయ నృత్యరంగానికి ప్రతీక

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో సంస్థ 18వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ వి.పద్మాకల్యాణ్, డ్యాన్స్ ఇండియా మేగజైన్ చీఫ్ ఎడిటర్, వైశాఖి నృత్యోత్సవ్ (వైజాగ్) వ్యవస్థాపకులు బిఆర్. విక్రమ్‌కుమార్, సాయి ఇంటర్నేషనల్ డ్యాన్స్ ఫెస్టివెల్(బెంగుళూరు) వ్యవస్థాపకులు సాయి వెంకటేశ్, నాట్య విశారద, అనుపమ మోహన్, త్యాగరాయ గానసభ అధ్యక్షు డు కళావిఎస్. జనార్ధనమూర్తి, గోల్కొండ నృత్యోత్సవ్ ఫెస్టివెల్ డైరెక్టర్ డాక్టర్ కిరణ్మయి బోనాల, వైఎస్ఆర్.మూర్తి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వైఎస్ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ జ్యోతి శేఖర్ నట్టువాంగం, గాత్రంపై సాయిదీపిక పసుమర్తి, మృదం గంపై వి.శ్రీధరాచార్య, వయోలిన్‌పై సాయికుమార్ కోలంక, ఫ్లూట్‌పై కె.ఉమా వెంకటేశ్వర్లు, గటంపై డాక్టర్ ఆర్.శ్రీకాంత్ వాద్యసహకారాన్ని అందించారు.


పాల్గొన్న పద్మాకళ్యాణ్, విక్రమ్‌కుమార్ తదితరులు

## ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### - ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** టిఆర్ఎస్ ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపైనే ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్ కుమార్ ఆధ్వర్యంలో వందలాది మంది నేతాజీనగర్‌కు చెందిన వివిధ పార్టీల నుంచి టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికలనాటికి తిరిగి రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా ఇప్పటి నుంచి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, మారిశెట్టి నర్సింగరావు, గుండు జగదీశ్, రవిశంకర్‌గుప్త, ఎం.భాస్కర్, పోతుల శ్రీకాంత్, జి.వెంకటేశ్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎం.దేవయ్య, పి.రాజకుమార్, ఎస్టీ.ప్రేమ్, సంతోష్, పిఎస్.శ్రీనివాస్, అరుణశ్రీ, ఎండి.గౌస్, యాసీన్‌ఆలలీ, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి తుడుం లక్ష్మి, ముచ్చకుర్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

## సందేశాత్మక 'స్వార్థం, రేపటికి వాయిదా' నాటికల ప్రదర్శన

### విజయవంతంగా ముగిసిన కె.ఎల్ స్మారక నాటికోత్సవాలు

**నాంపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య, సారిపల్లి కొండలరావు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ తొలి మాండలిక నాటక రచయిత కోదాటి లక్ష్మీనర్సింహారావు (కెఎల్) 99వ జయంతిని పురస్కరించుకొని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో మూడురోజులపాటు జరుగుతున్న కె.ఎల్ స్మారక నాటికోత్సవాలు ఈరోజు మూడవ ఆఖరిరోజు శ్రీకళానికేతన్, హైదరాబాద్ సమర్పణలో కె.ఎల్.నరసింహారావు రచన, డా. వెంకట్ గోవాడ దర్శకత్వంలో రూపొందిన 'స్వార్థం' నాటక, గ్రామవెలుగు నాట్యమండలి, రేపాల సమర్పణలో కె.ఎల్.నరసింహారావు రచన, పానుగోటి రంగా దర్శకత్వంలో రూపొందిన 'రేపటికి వాయిదా' సందేశాత్మక నాటికల ప్రదర్శనలతో కె.ఎల్ స్మారక నాటికోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ సభాధ్యక్షతన జరిగిన నాటికోత్సవాల ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ కేంద్రమంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి, విశిష్ట అతిథులు వేముల వెంకటేశ్వర్లు, బి.ఎం.రెడ్డి, కోదాటి లక్ష్మీనరసింహారావు కుటుంబసభ్యులు, తడకమళ్ళ రాంచందర్‌రావు తదితరులతో కలిసి నేడు ప్రదర్శింపబడిన నాటికల్లోని నటీనటులను ఘనంగా సత్కరించి, ఎంతగానో అభినందించారు. అనంతరం అతిథులు ప్రసంగించారు.


స్వార్థం నాటికలోని ఓ దృశ్యం

## విధి నిర్వాహణలో పోలీసుల త్యాగాలు ఎంతో గొప్పవి

### - మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు

**తార్నాక, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** విధి నిర్వాహణలో పోలీసుల త్యాగాలు ఎంతో గొప్పవని మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్‌రావు పేర్కొన్నారు. తార్నాక వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో తార్నాకలోని వెల్ఫేర్ అసోషియేషన్ హాల్లో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు మాట్లాడుతూ అమర పోలీసుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు డా. మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజలతో పోలీసులు స్నేహభావం, సత్‌సంభందాలతో ఉన్నప్పుడే నేరాలు అరికట్టవచ్చన్నారు. తెలంగాణలో సంస్కరణలు అమలు చేయడం సంతోషం అన్నారు. ఈ సందర్భంగా ఓ.యూ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన అమరుడైన కానిస్టేబుల్ శ్రీరాము బార్య అపర్ణకు నగదు బహుమతి అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ ఎల్. రమేష్ నాయక్, అడ్మిన్ ఎస్సై లక్ష్మినారాయణ, ఎస్సైలు భార్గవి, నరేష్, రాజేంద్రన్, బిక్షం, రాజేంద్రన్‌తో పాటు తార్నాక వెల్ఫేర్ అసోషియేషన్ కార్యదర్శి షఫి, అసోషియేషన్ ప్రతినిధులు డా. లక్ష్మినారాయణ, డా. సుమన,కోషాదికారి హరికుమార్, స్వరూప రాణి, నిరంజన్ బాబు, సుధాకర్ రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న తార్నాక వెల్ఫేర్ అసోషియేషన్

## 'అబ్దుల్ కలామ్ ఎక్సిలెన్సీ' అవార్డుల ప్రదానం

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** హెల్త్‌కేర్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో భారతరత్నం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా 'అబ్దుల్ కలామ్ ఎక్సిలెన్సీ' అవార్డుల ప్రదా నోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా మా జీ ఎమ్మెల్యే, లోక్‌సత్తా జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ జయప్రకాశ్‌నారా యణ్ హాజరై ఈ పురస్కారాలను వివిధ రంగాలకు చెందిన వారికి అం దించి గౌరవించారు. భారత్‌టుడే టీవీ డైరెక్టర్ డాక్టర్ జి.వల్లీశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సినీనటుడు డాక్టర్ గుండు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కనకదుర్గ నాట్యవైభవరి పేరుతో నృత్యగురువు నిర్మలా ప్రభాకర్ బృందం అద్భుతంగా నిర్వహించారు. సంగీత కార్యక్రమాన్ని లక్ష్మీభారతి, అనూష, వినయ్, వెంకీ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో బుర్రా మోహనకృష్ణ, శ్రావణి, జి.సి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## త్వరలో రోడ్డు విస్తరణకు మోక్షం

### - డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని సమస్యల లేని ప్రాంతాలుగా తయారు చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. ఆదివారం బౌద్ధనగర్‌లో జరిగిన దీపావళి సమ్మేళనంలో పాలల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృ ద్ధి, సంక్షేమ కార్యాక్రమాలు రెండిండిటికి ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలను పరిష్కరించామని అన్నారు. సికింద్రాబాద్ నియోజవకర్గంలో దశాబ్దాల కాలంగా ప్రజలు కోరుతున్న రోడ్డు విస్తరణ కార్యాక్రమాన్ని త్వరలోనే చేపడతామన్నారు. ఇప్పటికే లాలాపేట్‌లో విస్తరణ దాదాపు జరిపామని, తాజాగా చిలకలగూడ చౌరస్తా నుంచి జామైఉస్మానియా రైల్వేస్టేషన్ వరకు విస్తరించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే అధిరులు విస్తరణకు అవసరమైన ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారని, త్వరలోనే అమలు జరుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్‌లు కందిశైలజ, సామలహేమ, రాసూరి సునీత, నేతలు తీగుళ్ల కిరణ్‌కుమార్ గౌడ్, నారాయణ, కరాటేరాజు, మాధిరెడ్డి జలంధర్‌రెడ్డి, సుంకు రాంచందర్‌లు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పద్మారావుగౌడ్

## 'గీత కదంబం, గీత విభావరి' కార్యక్రమం

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** జీవితంలోంచి పాట పుట్టిందని, పాట మనసును పరిమళింపచేస్తూ తియ్యని భావనలు కలిగిస్తుందని ప్రముఖ రచయిత్రి డాక్టర్ శోభాపేరిందేవి అన్నారు. రాగరాగిణి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 'గీత కదంబం-గీత విభావరి' కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ప్రముఖ గాయనీమణులు ఎం.వి.రమణకుమారి, ఎం.వి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శోభాపేరిందేవి మాట్లాడుతూ పాటనే తన జీవితంగా మలుచుకున్న రమణకుమారి, సుబ్బలక్ష్మిలు జంటనగరాలకే సీనియర్ గాయనీ గాయకులని అన్నారు. పలువురు నేపథ్య గాయనీమణులు ఆలపించిన సినీ గీతాలను తన గళంతో మధురంగా గానం చేస్తూ ఉత్తమ గాయనీమణిగా రమణకుమారి మంచి పేరును సంపాదించారన్నారు. ఎందరో ఔత్సాహిక గాయనీమణులను ప్రోత్సహిస్తున్న రమణకుమారిలను శోభాపేరిందేవి అభినందించారు. ఎంతో సమర్థవంతంగా రాగరాగిణి సంస్థను నిర్వహిస్తున్న ప్రధాన కార్యదర్శి ఎంవి. సుబ్బలక్ష్మిలు కార్యకర్తే కాకుండా ఉత్తమ గాయని అని కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా గాయనీ గాయకులు పిడివి.ప్రసాద్, హరికృష్ణ, ఎం.వి.రమణకుమారి, శాంతకుమారి, సుజాత, కనక, రాధ, క్రోవి లలితావాణి, శశికళ, కృష్ణవేణి, విశాలక్ష్మి, పద్మజ కావ్య,గానం చేశారు.


ఎమ్మెల్యే సాయన్నకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారులు ఏసిపి రమేష్, మారేడ్‌పల్లి సిఐ నేతాజీ, కార్ఖాన సిఐ రవిందర్

## సెంట్రల్ సర్కిల్ విద్యుత్ నూతన కార్యాలయం ప్రారంభం

**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** లక్ష్మిదేవి ఆశీస్సులతో విద్యుత్‌సంస్థ అభివృద్ధి దిశలో ముం దుకు సాగాలని సెంట్ర ల్ సర్కిల్ విద్యుత్ సర్కిల్ ఎస్.ఈ,.పి. బ్రహ్మాం కోరారు. నాంప ల్లిలోని చంద్రవిహార్ కాంప్లెక్స్‌లోగల విద్యు త్ సెంట్రల్ కార్యాల యంలో లక్ష్మిపూజ లు ఘనంగా నిర్వహించారు. సర్కిల్ సూపరిండెంటెంట్ ఇంజనీర్ పి.బ్రహ్మాం,జనరల్ మేనేజర్ మంజుల,సీనియర్,అకౌంట్స్ ఆఫీసర్ కరుణాకర్‌రెడ్డి,డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ జి.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు జె.నంద, సిహెచ్.కృష్ణయ్య, అమ్మవారికి దీపావళి పండుగ పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పి.బ్రహ్మాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత,ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారని, ప్రజలు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు ఎ.మంజులారెడ్డి, కళ్యాణి, ప్రసూన, విజయరాణి, పద్మ, నితీష్‌కుమార్, కన్నరాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న ఎస్.ఈ.పి.బ్రహ్మాం

## ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో ఉపయోగం

### - కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగ పడుతాయని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. ఆర్ఏకెం ఫార్మా, నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో సిడిఎస్ బిల్డింగ్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ ప్రారంభించారు. క్యాంపులో నాచారం ప్రసాద్ హాస్పిటల్ వైద్య సిబ్బంది సేవలు అందించారు. సుమారు 500 విద్యసేవలను అందుకున్నారు. నిర్మాన్ ఆర్గనైజేషన్ సీఈఓ మెయూర్, ఆర్ ఎకెం ఫార్మ సిబ్బంది రవికుమార్, టీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, శ్రీరాం సత్యానా రాయణ, కట్టబుచ్చన్న గౌడ్, దోమల శ్రీనివాస్, మహేష్, సువర్ణ, సుగుణాకర్‌రావు, లడ్డు, శివ, శ్రీనివాస్, రెబల్ రాజు, జస్వంత్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్


నృత్యం చేస్తున్న కళాకారులు

## సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** లలిత కళలు, భారతీయసంస్కృతి సంప్రదాయాలు వంటి అంశాలపై పిల్లల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రముఖ సంగీత విద్వాంసులు మహాభాష్యం చిత్తరంజన్ అన్నారు. ఎస్ఎల్‌వి.మ్యూజిక్ అకాడమి డైరెక్టర్ డాక్టర్ చింతా నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంస్థ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మహాభాష్యం చిత్తరంజన్ కీబోర్డు, గిటార్, వీణ, వయోలిన్ తదితర అంశాల్లో అకాడమిలో శిక్షణ పొందిన వారు నిర్వహించిన కార్యక్రమాలు అందరిని అలరించాయి. అంతకు ముందు శాస్త్రీయ సంగీతంలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విజేతలకు సర్టిఫికేట్లు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్.మూర్తి పాల్గొన్నారు.

## భాషా, సంస్కృతుల పట్ల ప్రవాస తెలుగువారి కృషి అమోఘం

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మన భాషా, సంస్కృతుల పట్ల ప్రవాస తెలుగువారు చూపుతున్న ఆధరాభిమానాలు అమోఘమని వక్తలు పేర్కొన్నా రు. సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక, సారస్వత సంఘం (ఇట్క్లా), ఫిలిం ఎనలిటిక్ అండ్ అప్రిసియేషన్ సొసైటీ (ఫాస్) అధినేతలు సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు, ఎ.విజయ్‌కుమార్, కలవెండి కెఎస్. మూర్తి ఆధ్వర్యంలో రజతోత్సవ నాంది ప్రస్తావన కార్యక్రమం అంతర్జాల వేదికపై జరిగింది. ఈ సందర్భంగా వివిధ దేశాలలో ఉన్న తెలుగువారు భాషా కళలకు చేస్తున్న సేవలు ప్రశంసించారు. ముఖ్యఅతిథిగా ఎపి శాసన సభ పూర్వ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ తోటకూర ప్రసాద్ లను ఘనంగా సత్కరించారు. హస్తకళా శిరోమణి డాక్టర్ కమలప్రసాదరావు, డాక్టర్ రవికొండబోలు, డాక్టర్ శ్రీరామ్ శొంఠి, సరోజ కొమరవోలు, గేయకవి డాక్టర్ ఎం.కె.రాము, రేలంగి నరసింహారావు, దోగిపర్తి శంకరరావు, లక్ష్మీమణి మోహనరావు, ఎం.బుజంగరావు పాల్గొన్నారు. సంగీత దర్శకులు రామాచారి శిష్య బృందం సభ్యులు టి.అంజన, రాహుల్ శిష్టా, డి.ఎ.మిత్ర పాడిన పాటలు ఎంతో అలరించాయి.


'నాట్య కౌసల్య' బిరుదు ప్రదానంచేసిన దృశ్యం

## ప్రతిభా నాట్యకళాకారిణిలకు 'నాట్య కౌసల్య' బిరుదు ప్రదానం

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** ప్రతిభా నాట్యకళాకారిణిలకు 'నాట్య కౌసల్య' బిరుదు ప్రదానోత్సవ కార్యక్రమంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, వైజిమెన్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో యువ ప్రతిభా నర్తకీమణులకు 'నాట్య కౌసల్య బిరుదు' ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత వైఎస్ఆర్. మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త బి.జయరాములు హాజరై డాక్టర్ తేజస్విని, డాక్టర్ అత్రి అజిత్, సాగరిక, వర్ణలకు ఈ పురస్కారాలను అందించి ప్రసంగించారు. నాట్యం పంచమ వేదమని వివరించారు. ఈ సందర్భంగా నాట్యగురువు కిరణ్మయి నాట్యంపై విశ్లేషణాత్మక ప్రసంగం చేయగా కార్యక్రమంలో వై.రామలింగేశ్వరరావు, వై.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం ఆసుపత్రిలో ఘనంగా ఆయుర్వేద డే


పూజలు చేస్తున్న పరశరామ్ తదితరులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అయుర్వేద డే ను పురస్కరించుకొని ఆదివారం కంటోన్మెంట్ 8వ వార్డు బొల్లారంలోని సర్దార్ వల్లాబాయ్ పటేల్ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన దన్వంత్రి పూజా కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు ఎంప్లాయిన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ.పరశరామ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆరోగ్య పరిరక్షణకు యోగా అవసరం : జంపనప్రతాప్

**కంటోన్మెంట్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** దీర్ఘకాల వ్యాధుల నివారణకు ఆయుర్వేద, యోగా ఎంతో అవసరమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. 6వ వార్డు వినాయక టవర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పతంజలి వెల్‌నెస్ యోగా ఆయుర్వేద కేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు త్యాగి, ఫిజిషియన్ డాక్టర్ భార్గవ్, డాక్టర్ వెంకట స్వామి, మేనేజర్ అమన్ తదితరులు పాల్గొన్నారు.

## నాట్యశిఖరం వెంపటి చినసత్యం జయంతి నాట్యమహోత్సవం

**రవీంద్రభారతి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** కూచిపూడి నృత్యరంగంలో అత్యాధునిక కాలంలోనూ నాట్యశిఖరాయ మానంగా విరాజిల్లుతున్న ప్రఖ్యాత కూచిపూడి నా ట్యాచార్యులు పద్మభూషణ్ డా. వెంపటి చినసత్యం 93వ జయంతి వేడుకలను ప్రముఖ సాంస్కృతిక సంస్థలు భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్‌లు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంప్రదాయ కూచిపూడి నృత్యాలతో నాట్యమహోత్సవాన్ని ఉదయం నుండి సాయంత్రం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించింది. ఈ సందర్భంగా జరిగిన సభాకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్ తెలుగుజాతి గుర్తింపుగా విరాజిల్లుతున్న కూడిపూడి నృత్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చి తెలుగుజాతిని గౌరవించేస్థాయికి చేర్చిన చినసత్యం సదా స్మరణీయులని కొనియాడుతూ ఆయనకు ఘననివాళులర్పించి, విచ్చేసిన విశిష్ట అతిథులు బి.ధర్మారావు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, యక్షగాన కంఠీరవ డా. పసుమర్తి శేషుబాబు, కూడిపూడి నాట్యగురువు శ్రీనివాసశర్మ, కరాటే కళ్యాణి, వేణుశ్రవణ్, సంస్థల అధ్యక్షులు లయన్ కె.వి.రమణారావు, లయన్ లలితారావులతోపాటు మారుతి వరుణ్, మాగంటి వసుధలతో కలిసి నేడు నాట్యమహోత్సవంలో ప్రదర్శనలిచ్చిన కళాకారుల నృత్యగురువులు కనకదుర్గ, భక్షిప్రసన్న, విజయలక్ష్మి, శ్రీవాణి, సుధీర్‌కుమార్, లలితాధనలక్ష్మి, సురేఖప్రసాద్, విమల, మైథిలి, లక్ష్మీసౌజన్యం, వసుధ, రవళి తదితరులను ఘనంగా సత్కరించి నర్తన చూడామణి అవార్డులను ప్రదానంచేసి బ్రహ్మాంజలి, కులుకుల నడవరు కొమ్మలారా, భామాకలాపం, పలు అన్నమాచార్య, త్యాగరాజ, రామదాసు కీర్తనలు, నృత్యఅంశాలతో శాస్త్రీయ సంప్రదాయ శోభను ఘుమఘుమలాడించిన చిన్నారి నృత్యకళాకారులను అభినందించి శుభాశీస్సులందజేశారు.


అవార్డుతో సత్కరిస్తున్న దామోదర్‌గుప్త, ధర్మారావు, దైవజ్ఞశర్మ, రమణారావు, లలితారావు అతిథులు

## 'నిపుణ' పురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** ఏ వ్యక్తి అయినా ఒక రంగంలో నైపుణ్యం సంపాదించడం అంత సులువు కాదని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో నృత్యాంజలి అకాడమి ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అధినేత్రి టివి.శిరీష ఆధ్వర్యంలో 'నిపుణ' పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం సాహితికిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. పురస్కారాలను సాంస్కృతికరంగంలో గుదిబండి వెంకటరెడ్డి, సంగీతం, వీణ రంగంలో చివుకుల ఉమాదేవి, న్యాయవాదిది బాల భానుమూర్తి, ఫ్యామిలి కౌన్సిలర్ రావి రమలకు అందించి గౌరవించారు. కార్యక్రమంలో న్యాయవాదులు నివేదిత, విజయ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 'నృత్యాంజలి' అకాడమి డైరెక్టర్ టివి.శిరీష శిష్యబృందం ఆధ్వర్యంలో నృత్యగానలహరి కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది.


'నిపుణ' పురస్కారాల ప్రదానం చేసిన దృశ్యం

## జాతీయ స్థాయిలో వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

### - ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ కార్యదర్శి రామచంద్రయ్య

**చిక్కడపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** అఖిలభారత స్థాయిలో వయోవృద్ధులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కన్ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నికైన పి.రామచంద్రయ్య అన్నారు. అసోసియేషన్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కన్ఫెడరేషన్ కార్యదర్శిగా ఎన్నికైన పి.రామచంద్రయ్యను అభినందించే కార్యక్రమం ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆరాధన సంస్థ అధినేత గుదిబండి వెంకటరెడ్డి, త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి, తెలంగాణ రాష్ట్ర వృద్ధుల కన్వీనర్ మహ్మద్ రజా ముఖ్యఅతిథిలుగా హాజరై సత్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధుల కోసం నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ గురజాడ శోభాపేరిందేవి,కార్యదర్శి శంకరరావు నిర్వహణలో జరిగింది.


రామచంద్రయ్యను సత్కరించిన దృశ్యం

## ఘనంగా అవధానకర్త డిఐఎల్ఎన్ మూర్తి స్మారక పురస్కార ప్రదానోత్సవం

**నాంపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** ప్రముఖ అవధానకర్త డి.ఐ.ఎల్.ఎన్.మూర్తి స్మారక పురస్కార ప్రదానోత్సవం శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో డి.ఐ.ఎల్.ఎన్.మూర్తి స్మారక సమితి ఆధ్వర్యం లో ఘనంగా జరిగింది. ఓయు తెలుగుశాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు అడ్వకేట్ నారుమంచి అనంతకృష్ణ ఆత్మీయ అతిథులు డా. జి.ఎం. రామశర్మ, డా. ఆచార్య ఫణీంద్ర, డా. ఆర్‌విఎస్ఎస్.అవధానులు తదితరులతో కలిసి ఒకేఒక అచ్చతెలుగు అవధాని, అసమాన అవధాన సార్వభౌమ డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి డి.ఐ.ఎల్.ఎన్.మూర్తి స్మారక పురస్కారం-2022 ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వాచస్పతి, వేదావధాని డా. ఆర్.వి.ఎస్.ఎస్.అవధానులు వెయ్యేళ్ళ తెలుగు మహాభారతం అనే అంశంపై ప్రసంగించారు. సభకుముందు బాసర ఐఐటి విద్యార్థి బానావత్ నితిన్ అష్టావధానం, అష్టావధాని డా. బి.ఓంప్రకాశ్ అనుసంధానకర్తగా వ్యవహరించగా విజయవంతంగా జరిగి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది.




దీపావళి సందర్భంగా టపాసులు కాల్చుతున్న మహిళలు

# సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు


వినాయకనగర్‌లో ఎమ్మెల్యే మాగంటిగోపినాథ్ సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్న స్థానికులు

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 23, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ప్రజలందరు ఆకర్షితులై టిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని గ్రేటర్ హైదరాబాద్ టిఆర్ఎస్ అధ్యక్షులు, జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. ఆదివారం రహ్మత్‌నగర్ డివిజన్ వినాయక నగర్ బస్తీనుంచి దాదాపు 200మంది స్థానిక ఎమ్మెల్యే మాగంటిగోపినాథ్, కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా సంక్షేమంకోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని గుర్తుచేశారు. ప్రజలంతా సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు మన్సూర్, ప్రధానకార్యదర్శులు సింగారి శ్రీనువాస్, సుబ్బరాజు, నాయకులు నాగరాజు, జాఫర్ హుస్సేన్, జబ్బార్, గని, నందు, ధనూజ, రాజు, భవాని, చందు, పద్మ, హుస్సేన్, పవన్,తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యలక్ష్మి మందిరానికి వచ్చే భక్తులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం


చార్మినార్ ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ రవికి భాగ్యలక్ష్మి మందిరం కమిటీ ప్రతినిధులు ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

చార్మినార్, అక్టోబరు 21 ప్రభాతవార్త : దీపావళి పండుగ సందర్భంగా చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ కె.ఎస్ రవి తెలిపారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో జరుగుతున్న దీపావళి మహోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ మందిరం కమిటీ ప్రతినిధులు సూర్యప్రకాష్ ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ రవికి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ప్యారశాని వెంకటేష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు. కాగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరానికి వచ్చే భక్తుల కోసం తమ వాహనాలను పార్కింగ్ చేయడానికి చార్మినార్ యునానీ ఆసుపత్రి, చార్మినార్ సమీపంలోని సర్దార్ మహల్, చార్మినార్ బస్‌స్టాండ్, ముఖిదుల్లా స్కూల్ గ్రౌండ్ ఆవరణలో ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించారు.

# కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే సాయన్న


3వ వార్డు కార్కానలో 20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సాయన్న, సిఈఓ అజిత్ రెడ్డి, మర్రి,జె.ఎం.ఆర్.తదితరులు

కంటోన్మెంట్, అక్టోబర్ 23 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. 3వ వార్డు కార్కాన ముస్లిం బస్తీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను సిఈఓ అజిత్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ టిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ బోర్డు ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డిలతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ శుభకార్యాలు, పెళ్లిల్లు, సమావేశాలు వంటి కార్యక్రమాలు జరుపుకునేందుకు ఎమ్మెల్యే నిధులతో రూ. 20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామన్నారు. అదే విధంగా పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్లు టీ.ఎన్.శ్రీనివాస్, ముప్పిడి గోపాల్, మాజీ బోర్డు సభ్యుడు ప్రభాకర్, టిఆర్ఎస్ నాయకులు నివేదిత, పనస సంతోష్, సదానంద్ గౌడ్, మధుకర్, వేణుగోపాల్ రెడ్డి,నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సాయం అందించాలి

## - డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి

**చేవెళ్ల, అక్టోంబరు 23, ప్రభాతవార్త :** పేద విద్యార్దులను సాయం అందించాలని రంగారెడ్డి జిల్లా డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి అన్నారు. ఆదివారం చేవెళ్ళ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని సుమారు 200 మంది విద్యార్ధినులకు దుప్పట్లును రంగారెడ్డి జిల్లా డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి జన్మదినం సందర్భంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా రంగారెడ్డి జిల్లా డిసిసి మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి మాట్లాడుతూ పేద విద్యార్దులను అన్ని విధాలుగా అదుకునేందుకు నిరంతరం పాటుపడుతామన్నారు. విద్యార్దులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. చదువుతోనే సమాజంలో విలువ గుర్తింపు ఉంటుందన్నారు. వసతి గృహం విద్యార్దులను అదుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. విద్యార్దులకు విద్యతో పాటు వసతులు కూడ కల్పించేందుకు ఎల్లప్పుడు ముందుంటామన్నారు. రానున్న చలికాలం కావడంతో విద్యార్దులకు దుప్పట్లను అందజేసి కొంత వరకైన సహాయం చేసినట్లువుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, చేవెళ్ళ సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి,ఎంపిటిసి రాములు, సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి,చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దేవర సమతవెంకట్‌రెడ్డి ఉపసర్పంచ్ గంగియాదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి,సీనియర్ నాయకుడు పడాల ప్రభాకర్, మధుసూదన్‌గుప్తా,శ్రీనివాస్‌గౌగ్, పెంటయ్యగౌడ్, యాలాల మహేశ్వర్‌రెడ్డి, పాండుయాదవ్, నారాయణదాస్, శేఖర్, మల్లారెడ్డి, మాణిక్యం, పడాల రాములు, బూర్ల సాయినాథ్, కోరే రాజు, జనార్దన్, వాజీద్, మాదవరెడ్డి, శ్రీశైలం, బండారు వెంకట్‌రెడ్డి,బూరాన్ ప్రభాకర్, బిజెపి నాయకులు శర్వలింగం, అత్తిల్లి అనంతరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ టెకులపల్లి శ్రీనివాస్, ఆగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, బూరాన్ సురేష్, పిఏసిఎస్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, వార్డు మెంబర్‌లు ఇరమ్మొళ్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుంది

## - మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో వెలుగు నింపుతుందని, ఆ పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ హరీశ్ సూచించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పర్వదినాన్ని జిల్లాలోని ప్రజలందరూ ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని, ఈ పండగ ప్రజల జీవితాల్లో మంచిని తీసుకరావటంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ ఆకాంక్షను వ్యక్తం చేశారు. సోమవారం దీపావళి పండుగ సందర్భంగ జిల్లా ప్రజలతో పాటు అధికారులకు, ప్రజాప్రతినిధులకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి ఎపుడు విజయం సాధిస్తునే ఉంటుందని, ప్రతి ఒక్కరు ఎవరికి చెడు తలపెట్టకుండ మంచిని కోరుకోవాలని ఆయన సూచించారు. ఏకాలంలోనైనా ఎప్పటికి చెడుకు తావు ఉండదని మంచి చేసే వారికి దైవం కూడ సహకరిస్తుందన్నారు.

# నేటి సదర్ ఉత్సవానికి ఏర్పాట్లు

**ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్‌లో సోమవారం నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో వాసవీటవర్స్ వద్ద దీపావళి సందర్భంగా సదర్ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పట్టణంలోని హనుమాన్‌నగర్ నుంచి దున్నలను అలంకరించి బ్యాండ్‌మేళాలతో మున్సిపల్ కార్యాలయం, ఎదులాబాద్‌రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. ఈసందర్భంగా హనుమాన్‌నగర్‌లో బైర సుధాకర్ దున్నపోతలతో విన్యాసాలు చేయించి సదర్ వేడుకలకు సిద్దం చేయిస్తున్నారు.

# కరాటే శిక్షణ ద్వారా ఆత్మరక్షణ

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 23, ప్రభాతవార్త ఆత్మరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కరాటే శిక్షణ పొందడం అవసరమని దీని ద్వారా శారీరక ఆరోగ్యం పురోగతి చెందుతుందని జగద్గిరిగుట్ట సాగర సంఘం అధ్యక్షులు దయాసాగర్ పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట సగర సంఘం ఆవరణలో జీయోన్ కరాటే దుజో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే శిక్షణ కేంద్రంలో గెలుపొందిన వారికి ఆదివారం సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. కరాటే మాస్టర్ షేక్ ఖదీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో బెల్లులు సాధించిన వారికి చీఫ్ ఎగ్జామినర్ కుమార్ గురుంగ్ నేతృత్వంలో సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. అనంతరం సగర సంఘం ప్రధాన కార్యదర్శి అస్కాని శ్రీనివాస్ సాగర్ మాట్లాడుతూ ప్రధానంగా ఆత్మ రక్షణ కోసం ఆడపిల్లలు కరాటే శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిసర ప్రాంత వాసులకు కరాటే శిక్షణ ఇస్తున్న వారిని ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం దయాసాగర్‌తో పాటు శ్రీనివాస్ సాగర్ బ్రౌన్, ఆరెంజ్, ఎల్లో, బ్లూ బెల్టులను, సర్టిఫికెట్లను అందజేశాయి.

# వాగ్దానాలు నెరవేర్చడంలో ప్రభుత్వం ముందుంటుంది


జ్యోతినగర్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పోరేటర్ సబీహాగౌసుద్దీన్

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 23, ప్రభాతవార్త : ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ఎపుడు ముందుంటుందని కార్పోరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. జ్యోతినగర్‌లో గత 6నెలలుగా రోడ్డు సమస్య పెండింగ్‌లో ఉందని బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ధనరాజ్, కార్పోరేటర్ దృష్టికి తీసుకువెళ్ళగా వెంటనే బస్తీలో పర్యటించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య పెండింగ్‌లో ఉందని బస్తీ ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పనులు త్వరగా పూర్తిచేయాలని కార్పోరేటర్ అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో యోగి రాజు స్వామి, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఉద్యమం

### - సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్.బాలమల్లేశ్

### - జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన సందర్భంగ సన్మానాలు

**శామీర్‌పేట, అక్టోబరు 23, ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను దేశవ్యాప్తంగ నిరసిస్తూ ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు,ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ పార్టీ నాయకులకు సూచించారు. బాలమల్లేశ్ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైనందుకు ఆదివారం మూడు చింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి టి.రాములుగౌడ్ కాప్రకు వెళ్లి ఆయనను సన్మానించారు. ఆయనతో పాటు పలువురు జిల్లా నాయకులు కూడ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగ సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు,జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎన్.బాలమల్లేశ్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన 8ఏళ్లలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే విదేశాల్లో ఉన్న నల్లడబ్బును స్వదేశానికి తీసుకవచ్చి భారతదేశంలోని ప్రతి కుటుంబానికి 15లక్షల రూపాయలు జమ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చటంలో విఫలమైందన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి విస్మరించారన్నారు. రానున్న కాలంలో బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగ ఆ విధానాలను నిరసిస్తూ సిపిఐ ప్రజాపోరాటాలు చేయాలని ఎన్.బాలమల్లేశ్ పిలుపునిచ్చారు. అక్టోబరు 14నుంచి 18వరకు సిపిఐ జాతీయ మహాసభలు జరిగినట్లు, ఈ 24వ మహాసభలో ఎన్.బాలమల్లేశ్ సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నిక కావటంతో మూడుచింతలపల్లి మండల సిపిఐ కార్యదర్శి టి.రాములుగౌడ్‌తో పాటు జిల్లా పార్టీ కార్యవర్గసభ్యులు టి.శంకర్, ఆర్.కృష్ణమూర్తి, కాప్ర మండల కార్యదర్శి డి.యాదగిరి, సిపిఐ కాలనీ కార్యదర్శి రాజేశ్వరి, సిపిఐ నాయకులు వెంకటేశ్‌యాదవ్, చంద్రయ్యలు పాల్గొని ఎన్.బాలమల్లేశ్ ను ఘనంగ సన్మానించారు.

# మానవ సేవయే మాధవ సేవ: డాక్టర్ రమేష్ గూడపాటి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్ గూడపాటి, చిత్రంలో గోపాల్‌రావు, రాజ్‌కుమార్ విగ్ తదితరులు

హైదరాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త : మానవ సేవయే మాధవ సేవగా పేద ప్రజలకు సేవలందించడం అరుదైన విషయమని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్ గూడపాటి అన్నారు. హిందూ శ్మశానవాటిక ప్రభంధక కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిత్యం పేదల కోసం హర్రాస్‌పెంటలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో లక్ష రూపాయలను వెచ్చించి, అనుభవజ్ఞులైన వారితో ఉచిత వైద్య శిబిరం, యోగా సెంటర్, ఉచిత కుట్టుశిక్షణ, మెహిందీ శిక్షణ ప్రారంభించి యేడాది పూర్తైన సందర్భంగా ఆదివారం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ గూడపాటి మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులు, ప్రజల ఆహారపు ఆలవాట్ల కారణంగా అనేక రకాల వ్యాధులు సంభవిస్తున్నాయని అన్నారు. నాణ్యమైన మంచి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామలక్ష్మణరాజు, ఆకుల పాండు, రంగారావు, రాజ్‌కుమార్ విగ్, రాజేంద్రపటేల్, వీరాస్వామి, విజయ్‌కుమార్, సాయి గిరిధర్, బి.కృష్ణగౌడ్, రతన్, విద్యాసాగర్, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, ఆకుల రవీందర్‌రావు, శ్రీనివాస్‌రావు, నరహరి, డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు, మహాపాత్ర, శ్రవణ్‌కుమార్, శివకుమార్, యాదయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసాయినటరాజ వార్షికోత్సవ వేళ శిష్యుల కూచిపూడిహేళ


కళాకారుల కూచిపూడి నృత్యహేళలో ఓ దృశ్యం

రవీంద్రభారతి, అక్టోబరు 23 ప్రభాతవార్త : నేటి తరం పిల్లలు పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడు తూ పబ్, మత్తుపదార్థాల సేవిస్తూ తమ జీవితాలను, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు వారికి చదువుతోపాటు భారతీయ శాస్త్రీయ కళలు, సంస్కృతి, సంప్రదాయాలను తప్పక నేర్పిస్తే వారు సన్మార్గంలో పయనిస్తారన్న కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, పద్మశ్రీ పద్మజారెడ్డి, కళాకారులు నియమ నిబద్ధతతో కష్టపడి నృత్యాన్ని కొనసాగిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పురస్కారాలు పొంది గౌరవస్థానానికి ఎదుగుతారని స్పష్టం చేస్తూ శ్రీసాయి నటరాజ అకాడమీ వార్షికోత్సవ వేళ శిష్యబృంద కూచిపూడి నృత్యహేళతో అత్యంత అద్భుతంగా కన్నులపండువ చేసిన కళాకారిణులను, నేర్పిన సంస్థ డైరెక్టర్, ప్రముఖ నాట్యగురువు కళాశ్రీ డా. పి.రమాదేవిని అభినం దించారు. రవీంద్రభారతి ప్రధాన మందిరం లో శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ 33వ వార్షికోత్సవ వేడుకలను పురస్క రించుకొని సంస్థ శిష్యులు వినాయకకౌత్వం, గం గణపతి, జతిస్వరం, అన్నమాచార్య కీర్తన అలమే లుమంగ, చరణములే నమ్మితి, దశావతారశబ్దం, వర్ణం, భజరే గోపాలం, శంభో మాధవా, కృష్ణం కలియసఖీ తదితర అంశాలతో కూచిపూడి నృత్య శోభను విరజిమ్మగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మజారెడ్డి, విశిష్ట అతిథులు డా. మామిడి హరి కృష్ణ, బెంజిమిన్, భాగవతుల సేతురాం, విక్రమ్‌కుమార్, పసుమర్తి రామలింగశాస్త్రి, మిశ్ర పుష్పిత, డా. పి.రమాదేవి కలిసి వివిధ కళా రంగాల్లో రాణిస్తున్న ప్రముఖులు అనుపమ మోహన్, లావణ్యలత, ప్రభాకర్‌రావు, ఎల్.లక్ష్మీ నారాయ ణలను ఘనంగా సత్కరించి విశిష్ట కళాసేవ పురస్కారాలను ప్రదానం చేశారు.

# దీపావళి సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి అలంకరణ


దీపావళి సందర్భంగా చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారి అలంకరణ

**చార్మినార్, అక్టోబరు 23, ప్రభాతవార్త :** దీపావళీ సందర్భంగా పాతబస్తీలోని మార్కెట్లు కొనుగోలుదారులతో కళకళ లాడాయి. ప్రజలు దీపావళికి సంబంధించిన పలు రకాల వస్తువులు ఖరీదు చేశారు. చార్మినార్, గుల్జారాస్, ఘాన్సీబజార్, చార్‌కమాన్, గౌలిపుర, ఛత్రినాక ప్రాంతాలలో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేసి దీపావళీ పండుగకు సంబంధించిన వస్తువులను వ్యాపారులు విక్రయించారు. ఈ నెల 24వ తేదీన జరగనున్న దీపావళీ పండగ సందర్భంగా పాతబస్తీలోని వస్త్రాల వ్యాపారులు అదే విధంగా బంగారం, వెండి వ్యాపారులు తమ దుకాణాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పాతబస్తీలో పండుగ వాతావరణం కనిపించింది. పటేల్ మార్కెట్‌లోని షాపులు విద్యుత్ దీపాల కాంతులలో దగదగమె రిసిపోతున్నాయి. ఘాన్సీబజార్, దూద్‌బౌలి, గుల్జారాహౌస్ ప్రాంతాలలోని మిఠాయిల దుకాణాలు రద్దీగా కనిపించాయి. పెద్ద ఎత్తున ప్రజలు మిఠాయిలు కొనుగోలు చేశారు. దీపావళీ పండుగ సందర్భంగా పువ్వుల ధరలు విపరీతంగా పెరిగాయి. చార్మినార్, గుల్జారాహౌస్ పరిసర ప్రాంతాలలో విపరీతమైన రద్దీ నెలకుంది. కాగా దక్షిణ మండలం పోలీసులు దీపావళీ సందర్భంగా పాతబస్తీలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరాన్ని అందంగా అలంకరించారు. జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందినభక్తులు శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# పాదయాత్రలతో సమస్యల పరిష్కారం


పిఆర్‌నగర్‌లో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, కార్పోరేటర్ మహేందర్ కోడిచెర్ల

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 23, ప్రభాతవార్త : ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పాదయాత్రలు నిర్వహించి సమస్యలు గుర్తించడం జరుగుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం మోతీనగర్ ప్రాంతంలోని పిఆర్‌నగర్ పార్కు అవంతి నగర్ తోటలో సిసిరోడ్డు నిర్మాణ పనులకు బబ్బుగూడలో సిసిరోడ్డు నిర్మాణ పనులకు బిఎస్‌సి సిసిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు త్వరగా పూర్తియ్యేలా చూడాలని ఎమ్మెల్యే అన్నారు. అదేవిధంగా అవసరమయిన చోట నిధులు కేటాయించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్ కోడిచెర్ల, ఈఈ సత్యనారాయణ, డిఈ శ్రీదేవి, ఏయిరంజిత్, మాజీ కార్పొరేటర్ శ్రావన్‌కుమార్, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు అంబటి శ్రీను, బిసిసెల్ అధ్యక్షులు నాగుల సత్యం, రాజ్‌కుమార్ గౌడ్,పిఆర్‌నగర్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, బిజెపి నాయకులు ఎర్రస్వామి, మల్లేష్‌గౌడ్, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్ ఎన్నిక

**ఘట్‌కేసర్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ మండల వడ్డెర కుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా శివరాత్రి వెంకటేశ్ ఎన్నిక అయ్యారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మైసమ్మగుట్ట దేవస్థానం ఆవరణలో ఆదివారం వడ్డెర కుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాజీ అధ్యక్షులు బోదాసు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి దేరంగుల ముత్యాలు తదితరులు హాజరై నూతన కమిటీని ఎంపిక చేశారు. సమావేశంలో అందరి అభిప్రాయాలను సేకరించి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఘట్‌కేసర్ మండల వడ్డెర కుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా మర్రిపల్లిగూడకు చెందిన శివరాత్రి వెంకటేశ్ ఎన్నిక అయ్యారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరికుప్పల వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా మ్యాగని నర్సింగ్‌రావు, ప్రధానకార్యదర్శిగా ఒర్సు బిక్షపతి, ఉపకార్యదర్శి మ్యాగని అంజనేయులులు ఎన్నిక అయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షులు వెంకటేశ్‌తో పాటు నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలదండలతో సన్మానించి అభినందించారు. వడ్డెర కులస్థుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. నూతన అధ్యక్షులు వెంకటేశ్ అనుచరులు బాణాసంచా కాల్చి బ్యాండ్ మేళాలతో సందడి చేశారు. అనంతరం ఆయన ఘట్టుమైసమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

# ఉచిత వైద్య శిబిరం

**ఘట్‌కేసర్ రూరల్ :** అవుశాపూర్ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరంలో 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు సర్పంచ్ ఏనుగు కావేరి తెలిపారు. నగరానికి చెందిన నేచురల్ పౌండేషన్ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు కంటి, ఎముకలు, గుండె, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు.


దోమలగూడలో భారత్‌సేవాశ్రమ్‌సంఘ్ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా పేదలకు చీరల పంపిణీ చేస్తున్న స్వామి మునీశ్వరానందా, స్వామి వెంకటేశ్వరనందా


సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రైతుహక్కుల సాధన సమితి సమావేశంలో పాల్గొన్న సమితి అధ్యక్షుడు బాలుయాదవ్, జింకలయాదయ్య తదితరులు

# బాణసంచా దుకాణాదారులు జాగ్రత్తలు పాటించాలి

**షాబాద్, అక్టోబర్ 23, ప్రభాతవార్త :** బాణసంచా (క్రాకర్స్ స్టాల్స్) ఏర్పాటు చేసిన నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ....దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా క్రాకర్స్ స్టాల్స్ ఏర్పాటు చేసిన నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి దుకాణం ముందు ఇసుక బకెట్లు, వాటర్ డ్రమ్ము, ఫైర్ సేఫ్టీ సిలిండర్ పెట్టుకోవాలన్నారు. దుకాణాలకు, దుకాణాలకు మధ్య దూరం పాటించాలని, అగ్ని ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందరూ ఇంటివద్ద జాగ్రత్తలు పాటిస్తూ, పిల్లలు తల్లిదండ్రుల, పెద్దల సమక్షంలోనే టపాసులు కాల్చుకోవాలన్నారు.


**వార్త CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, MOHAMMED NOOR AHMED, R/o. 20-1-450, Fatima Cly, Hussaini Alam, Hyd, T.S, Changed My Name As "MOHAMMED NOOR UDDIN" S/o. MOHAMMED RAHEEM UDDIN"
(Ro.No.2745347)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవసలిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**PUBLIC NOTICE**

The general public is hereby informed that, my client, **Sri Giridhar Rachuri S/o. Sri. Shiva Shanker Rachuri,** Aged about: 41 years, Occupation, Business, R/o. H.No.9-1-1, Garden Street Champapet, Saroornagar, Vaishalinagar, K.V Rangareddy, T.S-500079., agreed to purchase All that part and parcel of land marked as Plot No.289, in Survey No.'s 568,569 & 576 admeasuring 300 Square yards equivalent to 250.83 Square meters, situated at PEDDA AMBERPET Village Hayathnagar Taluk, Ranga Reddy District, under Pedda Amberpet Gram Panchayat and within the Registration Jurisdiction of Sub Registrar Pedda Amberpet, T.S., and Bounded by NORTH: 30 ft. Wide Road, SOUTH: Plot No. 291, EAST: Plot No. 288, WEST: Plot No. 290 From i) Sri. Akavaram Srinivas Reddy S/o. A. Venkat Reddy, Aged about: 75 years, Occupation: Business ii) Sri. Akavaram Madhava Reddy S/o. Akavaram Srinivas Reddy, Aged about: 55 years, Occupation: Business iii) Smt. G Manjula Reddy W/o. G Sanjeeva Reddy D/o. A. Srinivas Reddy, Aged about: 49 years, Occupation: House hold iv) Sri. A Yasvanth Reddy S/o. A. Srinivas Reddy, Aged about: 45, Occupation: Business, All are R/o. H.No: 1-7-509/6/6, Haringar, Ramnagar, Musheerabad, Hyderabad-500020, T.S., being the legal Heirs of (Akavaram Vanamma W/o. A. Srinivasa Reddy) Any person(s) having any objections(s), charge, claim, Lien over the said property shall approach the under signed office within SEVEN (7) Days from the date of this publication. No Objection, claim will be considered after the specified period and registration as per law will be procured.

**Sd/- Anshul Agarwal, *Advocate***
#1-2-298, Amarnath Kunj, St No.7, Domalguda, Hyderabad-500029
PH. NO. 8801617471

**PUBLIC NOTICE**

General public is hereby Informed that my Client **Sri YELLIPEDDI SRINIVAS,** aged about 48 years Occ: Private employee Resident of H.No 1-1-27/371/523, Sri Tirumala harmony Enclave, Kapra, Medchal-Malkajgiri dist, 500062 was in the custody of the original sale deed document relating to his property i.e open plot No. 57B in survey no Part of 33/10 and 33/11, Admeasuring 250 Sq.Yards or 209 Sq.Meters, situated at chengicherla Village, Medipally mandal (Then Ghatkesar mandal), Medchal-Malkajgiri District(Then Rangareddy dist) Telangana. but the original document i.e Registered sale deed bearing document number 5372/1988 Dated:16th June 1988 have been lost /misplaced by my client at near Kushaiguda Bus Depot, at around 11.00 AM to 11.40 Am on Date 18/10/2022 While transit from Moula Ali Housing board Colony to Kamalanagar, ECIL by the Motorcycle namely Honda Unicorn Bearing no AP10BR6080 and that effect my client also made a complaint before police officials at PS Kushaiguda, Rachakonda Commissionerate, Medchal- Malkajgiri dist.
If any person or person(s) who came across the custody of the said Original Document i.e. Registered sale deed bearing document number 5372/1988 Dated:16th June 1988 be pleased to hand-over to the under-signed or to my client.

**Y BHARATH, Advocate**
Ho.No: 2-81/59/43 Dwaraka nagar phase 1, Chengicherla, Hyderabad 500098, Ph: **9618214652,**
Email: ybharath716@gmail.com

## టిఆర్ఎస్ ప్రభుత్వంలో కుల వృత్తుల బలోపేతం : మంత్రి కెటిఆర్

### చెట్ల పన్ను రద్దు, కల్లు డిపోలను తెరిపించి గౌడన్నలకు అండగా నిలిచాం



గౌడ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మంత్రి కెటిఆర్, చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే తదితరులు

**తుర్కయాంజాల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కులవృత్తులు ధ్వంసమయ్యాయని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం కుల వృత్తులను ప్రోత్సహిస్తూ వాటిని బలోపేతం చేస్తున్నామని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరిగిన గౌడ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రబుత్వం కృషి చేస్తున్నందని, ప్రబుత్వం ప్రతి కులవృత్తికి అండగా నిలిచిందన్నారు. వైన్ షాపుల్లో గీత కార్మికులకు 15 శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా గౌడన్నలకు చెట్ల పన్నును రద్దు, కల్లు డిపోలను తెరిపించి అండగా నిలిచామని తెలిపారు. గీత కార్మికులకు నెలకు రూ.2016 పెన్షన్, వృత్తిదారులకు మోపెడ్‌లు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించామని, ప్రతి గ్రామంలో నర్సరీ, ట్రాక్టర్, నీళ్లు, కరెంటు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, మండలి మాజీచైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య, పల్లె లక్ష్మణ్‌గౌడ్, బాలగోని బాలరాజు, అంబాల నారాయణ గౌడ్, వెంకన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో టిఆర్ఎస్ అభ్యర్థిదే విజయం : ఆజం అలీ



నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తున్న ఆజంఅలీ

**మలక్‌పేట, అక్టోబరు 23 ప్రభాతవార్త :** మునుగోడులో టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధిస్తారని మలక్‌పేట నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలో ఆజంపురా, చావుని డివిజన్ పార్టీ నాయకులతో ఆజం అలీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మునుగోడు ఓటర్లు మలక్‌పేట, ఎల్‌బినగర్ నియోజక వర్గాల్లో నివసిస్తున్నారని వారిని పార్టీ నేతలు కలుసుకుని సిఎం కెసిఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించి టిఆర్ఎస్ పార్టీకే ఓటు వేసే విధంగా ప్రచారం చేయాలని దిశానిర్ధేశం చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాయక్ అలీ, డివిజన్ అధ్యక్షుడు కారింగుల మారుతి, షౌకత్ అలీ, రాహుల్, సల్మాన్‌ఖాన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ సూర్యోదయ కాలనీకి చెందిన వీరస్వామి గుండెనొప్పి రావడంతో ఆపరేషన్ చేయించుకున్నారు. ఆర్థిక స్తోమతలేని ఆయన ఎమ్మెల్యేను సంప్రదించగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రెండు లక్షలు మంజూరు చేయించిన చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం పేదలకు వరం లాంటిదని, అధునాతన వైద్యసేవలను పొందేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, ఆనంతుల రాజిరెడ్డి, చిరంజీవి, ప్రశాంత్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.

## తండాల్లో కొలన్ శంకర్‌రెడ్డి ప్రచారం

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన తెలంగాణ బిజెపి సీనియర్ నాయకుడు కొలన్ శంకర్‌రెడ్డి పార్టీఅభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి మర్రిగూడ మండలంలోని ఖుదాబక్షిపల్లి గ్రామం సాయిబండ తండాలో ఇంటింటికి తిరిగి రాజగోపాల్ రెడ్డిని గెలిపించాలని కరపత్రాలు పంచి ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మోహన్ నాయక్, పండు, రవి, రాజుగౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీకి డిసిసి అధ్యక్షుడు స్వాగతం

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర తెలంగాణలో ప్రారంభమైన సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆయనకు స్వాగతం పలకడానికి నారాయణపేట జిల్లాకు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్, తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మాణిక్యం ఠాగూర్, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సిఎల్‌పి లీడర్ భట్టి విక్రమార్క తదితర అగ్రనాయకులతో కలిసి రాహుల్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం చల్లా బాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్‌కు ప్రజలు బుద్ది చెప్పడం ఖాయం: హరిగౌడ్



రాజగోపాల్‌రెడ్డి వెంట ప్రచారంలో పాల్గొన్న హరిగౌడ్

**సైదాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** నియంతృత్వ పోకడలు అనుసరిస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన టిఆర్ఎస్‌కు మునుగోడులో ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని బిజెపి నాయకులు లింగాల హరిగౌడ్ అన్నారు. మునుగోడు బిజెపి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్‌ల వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అనంతరం హరిగౌడ్ మాట్లాడుతూ మునుగోడు ప్రజల తీర్పు తెలంగాణాలో మార్పుకు నాంది పలకనుందన్నారు. కల్వకుంట్ల కుటుంబ పాలనకు మునుగోడు ప్రజలు చరమగీతం పాడనున్నారని అన్నారు.

## కూచిపూడి నాట్య ప్రదర్శనలో కృష్ణయుక్తకు జాతీయ అవార్డు



జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కృష్ణయుక్త

**వనస్థలిపురం, అక్టోబరు 23 ప్రభాతవార్త :** కూచిపూడి నాట్యంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గంధం కృష్ణయుక్త(8)కు నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమి సంస్థ జాతీయ ఆవార్డును ప్రకటించింది. నగరంలోని కింగ్ కోఠిలోగల తెలంగాణ సారస్వత పరిషత్‌లో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స చైర్మన్ బింగి నరేందర్‌గౌడ్‌ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి కృష్ణయుక్తకు జాతీయ అవార్డును అందజేశారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో నివాసముండే డాక్టర్ గంధ శాంతికుమార్ వాసవి ప్రసన్నల కుమార్తె కృష్ణయుక్త నాగోల్‌లోని జాన్సన్ గ్రామర్ స్కూల్లో 2వ తరగతి చదువుతుంది. రాధాకృష్ణ కూచిపూడి నాట్యాలయంలో కృష్ణప్రియ మాదాల వద్ద కూచిపూడి నాట్యంలో కృష్ణయుక్త శిక్షణ పొంది ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ అవార్డు పొందింది.

## నిఖిల్‌సాయికి లక్ష్మారెడ్డి పరామర్శ



నిఖిల్‌సాయిని పరామర్శిస్తున్న లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతున్న నిఖిల్‌సాయిని ఆదివారం టిఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. నాచారంకు చెందిన నిఖిల్‌సాయి గత కొద్ది రోజులగా అనారోగ్యంతో బాధపడుతూ కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో విషయం తెలిసిన బండారి లక్ష్మారెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. నిఖిల్‌సాయికి మెరుగైన వైద్య సదుపాయం అందించేందుకు బిఎల్ఆర్ ట్రస్ట్ కృషి చేస్తుందని తెలిపారు. త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో నిఖిల్‌సాయి ఆసుపత్రి నుంచి డిశార్చి అవుతారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్‌లో హరితహారం మొక్కల పంపిణి



మొక్కలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** తెలంగాణలో హరిత హారం సందర్భంగా ఆదివారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని 16వడివిజన్‌లో కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమీషనర్ చిట్టి నాగేశ్వర్‌రావు, తెలంగాణ బంజారా సమితి నాయకుడు దీప్‌లాల్ చౌహాన్ తదితరులు ఓపెన్ జిమ్ చౌరస్తాలో ప్రజలకు మొక్కల పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యరక్రమంలో ఆకుల హరీష్, మేకల యాదగిరి, మన్నెంరెడ్డి, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో వైదేహినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు



దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న దృశ్యం

**వనస్థలిపురం, అక్టోబరు 23 ప్రభాతవార్త :** వైదేహినగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలను కోర్టు అనుమతితో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహకారంతో ముఖ్య ఎన్నికల అధికారి పి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికలను నిరాటంకంగా జరిపించారు. అధ్యక్షునిగా దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పిసిహెచ్ వెంకటేశ్వర్లు ఎన్నికలలో విజయం సాధించారని తెలిపారు.

## రాహుల్ భారత్ జోడో యాత్రకు స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు



రాహుల్ గాంధీకి స్వాగతం పలుకుతున్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు, ఇతర నాయకులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ఎఐసిసి అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారత్ జోడోయాత్ర ఆదివారం తెలంగాణలో ప్రవేశించిన సందర్భంగా ఆయనకు స్వాగతం పలకడానికి మహేశ్వరం నియోజక వర్గంనుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు తరలివెళ్ళారు. కర్నాటక రాష్ట్రం లో ముగిసి ఆదివారం ఉదయం తెలంగాణలోని నారాయణపేట జిల్లా మక్తల్‌లో రాహుల్ యాత్ర ప్రారంభమైన సందర్భంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, మల్గారి శ్రీధర్‌రెడ్డి, తూళ్ళ నరహరిగౌడ్, పన్నాల రాజేందర్‌రెడ్డి, ఇక్కె శ్రీనివాస్, టేకుల సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అమృతా నాయుడు, తూళ్ళ సునీతగౌడ్, పెద్దబావి మౌనిక సుదర్శన్‌రెడ్డితో పాటు కార్యకర్తలు తరలివెళ్ళి టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికారు.

## పీపీగా నియమితులైన డి.ఎల్.పాండుకు సన్మానం



పాండును సన్మానిస్తున్న నాయకులు

**హయత్‌నగర్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించి న్యాయవాధులను ఏకంచేయడంలో అడ్వొకేట్ పాండు ఎంతో కృషిచేశారని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.శ్రీనివాస్‌ముదిరాజ్ అన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషనరీ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన హైకోర్టు న్యాయవాది డీఎల్‌పాండు ముదిరాజ్‌ను పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధి లక్ష్మారెడ్డి పాలెం మైత్రికుటీర్‌లోని ఆయన నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర న్యాయవాధుల సంఘం ప్రధాన కార్యదర్శిగా కూడా పాండు అందించిన సేవలు ఎనలేనివన్నారు. పాండు మాట్లాడుతూ తన పని తీరును గుర్తించి ప్రభుత్వ పీపీగా అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చి ముఖ్యమంత్రి నమ్మకాన్ని నిలబెడతానన్నారు. కార్యక్రమంలో నిమ్స్ కో–ఆర్డినేటర్ రాంబాబు, మండల ముదిరాజ్ సంఘం నాయకులు పిడుగు సత్యనారాయణ, శ్రీరాయాదయ్య, డి.శ్రీనివాస్, పెద్దమ్మ దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గణేష్, నాయకులు శ్రీనివాస్, గుడాల మల్లేష్ పాల్గొన్నారు.

## సీపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన ఎన్. బాలమల్లేష్




సీపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన ఎన్ బాలమల్లేష్‌ను సత్కరిస్తున్న రొయ్యల క్రిష్ణమూర్తి.

**నేరెడ్‌మెట్ అక్టోబర్ 23 ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వం బీసి జనగణనను తక్షణమే చేపట్టాలని సీపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్. బాలమల్లేష్ డిమాండ్ చేసారు. ఆదివారం బీసి హక్కుల సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కౌన్సిల్ సమావేశంలో రొయ్యల క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో భరత్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్. బాలమల్లేష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసి సామాజిక వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఋణం కల్పించడంలో విఫలం చెందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితవర్గాలకు, గిరిజన వర్గాలకు చెందిన ప్రతి కుటుంబానికి రూ. 10లక్షలు ఆర్థిక బంధు ప్రకటించి అమలు చేస్తున్నట్లుగానే బీసిలకు సైతం ఆ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. తెలంగాణ రాష్ట్రంలో 56శాతానికి పైగా బీసి సామాజిక వర్గాలు ఉన్నాయని వారం దరికి బీసిబంధు ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపిఐ నాయకులు శంకర్, వందన, చంద్రయ్య, క్రిష్ణ, శ్రీనివాస్, రొయ్యల గిరిజ, సహదేవ్, అజీజ్, నర్సింగరావు, వెంకటేష్, పద్మ, సంతోషి, విజయ్, వెంకటరమణ, పెద్దబాబు, ఊసన్న, గిరిప్రసాద్, వెంకటయ్య శ్రీనివాస్, చంద్రయ్య, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## డాన్ హైస్కూల్లో ప్రీ ప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్ కోర్స్ త్వరలో ప్రారంభం

**మలక్‌పేట, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ద్వారా గుర్తింపు పొందిన ప్రీ ప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్ కోర్స్ త్వరలో డాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రీ–ప్రైమరీ టీచర్స్ ట్రైనింగ్ (డాన్ హైస్కూల్ మలక్‌పేట)లో ప్రారంభం కానున్నది. ఇది 3 మాడ్యూళ్లతో కూడిన 9 నెలల కోర్సు. ఈ కోర్సులో థియరీ మరియు ప్రాక్టికల్స్ ద్వారా క్రియాశీల శిక్షణ ఇవ్వబడుతుంది. ఇందులో మాంటిస్సోరీ పద్ధతిలో కూడా బోధిస్తారు. దీంతో పాటు ఇంగ్లీషు సంభాషణ కూడా నేర్పిస్తారు. అలాగే, అనుభవజ్ఞులైన మరియు ప్రసిద్ధ విద్యావేత్తలచే శిక్షణా తరగతులు ఏర్పాటు చేయబడతాయి. ఈ కోర్సులో అడ్మిషన్లు పొందడానికి కనీస అర్హత పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఈ కోర్సు అనంతరం ఉత్తీర్ణులైన వారికి బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ద్వారా సర్టిఫికేట్లు జారీ చేయబడతాయి. ఈ కోర్సు ప్రపంచవ్యాప్తంగా ఆమోదించబడి ఉంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ అధినేత ఫజ్లుర్ రెహామాన్ ఖుర్రం ఒక ప్రకటనలో కోరారు. అడ్మిషన్ల కోసం పని వేళల్లో డాన్ హైస్కూల్ మలక్‌పేటకు నేరుగా సంప్రదించవచ్చు.

## ఉప్పల్ సర్కిల్‌లో ఒపెన్ జిమ్స్ నిర్వహణ పట్టించుకోరా..?

### అర్బాటంగా జిమ్‌ల ఏర్పాటు : శిథిలావస్థకు చేరిన పరికరాలు



ఉప్పల్ స్టేడియంలో శిథిలావస్థలో తుప్పు పట్టిన ఓపెన్ జిమ్



రామంతాపూర్ చిన్న చెరువు వద్ద విరిగిపోయి అధ్వాన్నంగా తయారైన ఒపెన్ జిమ్ పరికరాలు దృశ్యం.

**ఉప్పల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** గ్రేటర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో యువతీ, యువకులు, వృద్దులు, మహిళల శారీర కంగా, దారుఢ్యం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒపెన్ జిమ్ పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. ఒపెన్ జిమ్ ఏర్పాటు చేసిన 6 నెలలకే పలు చోట్ల శిథిలావస్థకు చేరగా వీటి నిర్వహణ అధికారులు గాలికి వదిలివేశారు. ఉప్పల్ సర్కిల్‌లో ఒక్కో డివిజన్‌లో రూ.పది లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు కాంట్రాక్టర్లకు కాసులు కురిపించగా, అధికారులు మొద్దు నిద్ర నటిస్తూ వీటిపై పట్టించుకోవడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ సర్కిల్‌లో గత ఏడాది క్రితం ఒక్కో డివిజన్‌లో రూ.పది లక్షల వ్యయంతో ఒపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ డివిజన్‌లో ఒక్కొటి చొప్పున వీటిని ఏర్పాటు చేశారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియం, రామంతాపూర్ చిన్న చెరువు, హబ్సిగూడ వీర రాజిరెడ్డి పార్కు, ఉప్పల్ డివిజన్‌లో వీటిని ఏర్పాటు చేశారు. స్థానిక కమ్యూనిటిహాల్స్, పబ్లిక్ స్థలాల్లో వీటిని ఏర్పాటు చేయగా, వీటిని ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే శిథిలావస్థకు చేరి తప్పుపట్టిపోతున్నాయి. ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో పరికరాల బోల్టులు ఊడిపోయి పనికిరాకుండా పోతున్నాయి. ఉదయం, సాయంత్రం ఎంతో మంది చిన్నారులు, యువతీ, యువకులు వీటిని ఉపయోగించుకుంటుండగా నిర్వహణ సరిగ్గా లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామంతాపూర్ చిన్న చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఒపెన్ జిమ్ పరికరాలను కొద్ది రోజుల క్రితం ఒక కారు ఢీకొట్టింది. దీంతో కొన్ని పరికరాలు వంగిపోయాయి. మరికొన్ని ఊడిపోయాయి. వీటిని స్థానికంగా ఉంటున్న కొందరు విక్రయించినట్లు విమర్శలున్నాయి. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని సిపిఎం నేత ఎర్రం శ్రీనివాస్ పేర్కొన్నారు. గత కౌన్సిల్ హయాంలో కూడా పలు చోట్ల కమ్యూనిటి హాల్స్‌లో జిమ్‌లు ఏర్పాటు చేయగా, చాలా చోట్ల పరికరాలు ఎన్ని ఉన్నాయో, ఎన్ని పోయాయో అధికారులకు తెలియకుండా ఉంది. పరికరాల లెక్కలు కూడా అధికారులు వద్ద లేకపోవడం గమన్హారం.

**ఒపెన్ జిమ్‌ల నిర్వహణ పట్టని అధికారులు..!** ఉప్పల్ సర్కిల్‌లో ఒపెన్ జిమ్‌లతోపాటు, కమ్యూనిటిహాల్స్‌లో ఏర్పాటు చేసిన జిమ్‌ల నిర్వహణ అధికారులకు పట్టడం లేదు. ఇంజనీరింగ్, స్పోర్ట్స్ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా పలు చోట్ల జిమ్‌ల గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు వచ్చిన సమయంలో హడావిడి చేయడం, తిరిగి వీటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. జిమ్‌ల నిర్వహణపై నేరుగా కమిషనర్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని సిపిఎం నేత ఎర్రం శ్రీనివాస్ ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ నాగోల్ మెట్రో నూతన అధ్యక్షుడిగా రవీందర్



కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్ తదితరులు

**మలక్‌పేట, అక్టోబరు 23 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ నాగోల్ మెట్రో నూతన అధ్యక్షుడిగా గుండు రవీందర్ ఎన్నికయ్యారు. సికింద్రాబాద్‌లోని లయన్స్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. అధ్యక్షుడిగా గండు రవీందర్, కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా శ్రీనాథ్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా గవర్నర్ లయన్ చింతల వెంకటనారాయణరెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సమాజానికి పలు సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు హరీష్‌రెడ్డి, కృష్ణప్రసాద్, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, మోహన్‌రెడ్డి, ఇబ్రహీం, సామ్యేల్, అశోక్‌కుమార్, శ్రీనివాస్, శ్రీరాంరెడ్డి, రామయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, రాగేశ్వరి, నిర్మల, కృష్ణకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డా.బి.ఆర్.అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఉప్పల్‌లో డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న తాడూరి శ్రీనివాస్, జై భీమ్ అసోసియేషన్ నేతలు

**ఉప్పల్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంబిసి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం జై భీమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రపంచ మేధావికి మణిహారం కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు అసోసియేషన్ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తాడూరి శ్రీనివాస్‌తోపాటు, దోసల శంకర్, గజ్జల సత్యరాజ్‌గౌడ్, రాజు, గుండెరాజు, జై భీమ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర బాలరాజు, ఏసూరి బాలపోచయ్య, రాపోలు రవి, మస్క ధన్‌రాజ్, బాలకృష్ణ, చిలుగూరి శ్రీకాంత్, జోన్నపల్లి క్రాంతి రాజు, రమేష్, వెంకటేష్, గుడిసెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని సూచించారు. ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత పౌరులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జై భీమ్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

## ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ సంపూర్ణ తదితరులు

**హయత్‌నగర్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** పేద, మధ్య తరగతి ప్రజల కోసం కార్పొరేట్ ఆసుపత్రులు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని పెద్దఅంబర్ పేట మున్సిపాలిటీ వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయ్ శేఖర్‌రెడ్డి అన్నారు. కామినేని జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో కుంట్లూర్‌లోని వార్డు కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ఈ సందర్భంగా కామినేని జనరల్ ఆసుపత్రి వైద్యులు కుంట్లూర్‌లోని ఆయా కాలనీల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జోర్క శ్రీరాములు, సుప్రసేనారెడ్డి, కొండల్‌గౌడ్ పాల్గొన్నారు.

## చెల్లని రూపాయి ప్రభాకర్‌రెడ్డి ఉప ఎన్నికలలో ఎలా గెలుస్తాడు : బండి సంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** గత ఎన్నికల్లో చెల్లని రూపాయి ప్రభాకర్‌రెడ్డి ఉప ఎన్నికల్లో ఎట్లా గెలుస్తాడని బిజెపి రాష్ట్రఅధ్యక్షుడు బండి సంజయ్, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్ ప్రశ్నించారు. మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా నాగోల్ అనంతుల రాంరెడ్డి గార్డెన్స్‌లో మునుగోడు ఓటర్ల ఆత్మీయ సమ్మేళన సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అసలు క్యాడరే లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే టిఆర్ఎస్‌కు వేసినట్లే అన్నారు. ప్రధాని మోడీ 75వేల ఉద్యోగ నోటిఫికేన్లు ఇచ్చారని, రైతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికార పార్టీ సర్పంచులు తెలంగాణలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దుబ్బాక, హుజూరాబాద్‌లో టీఆర్ఎస్‌ను ఒడిచినట్లు మునుగోడులో కూడా టీఆర్ఎస్‌ను ఓడించాలని కోరారు. మునుగోడు ఉపఎన్నికల్లో రాజగోపాల్‌రెడ్డిని గెలిపించి దిర పాలనకు అంతం పలకాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అరాచకమైన కుటుంబా పాలన నడుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కారు డబ్బులు కట్టలేని కెసిఆర్ కుటుంబం ఆదాయం నేడు వేల కోట్లకు చేరిందని ఆరోపించారు. కెసిఆర్ కుటుంబం కొడుకు ట్విట్టర్, బిడ్డ లిక్కర్, అల్లుడు కుట్ర, సడ్డకుని కొడుకు కమిషన్లతో వేల కోట్లకు ఎదిగారన్నారు. టిఆర్ఎస్ మునుగోడులో మందు, మటన్, రూ.40వేలు, గోల్డ్ బిస్కెట్లు పంచుతూ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. భారత్ జోడయాత్ర కాదని కాంగ్రెస్, టిఆర్ఎస్ జోడో యాత్ర అని ఎద్దేవా చేసారు. కమ్యూనిస్టు పార్టీని నాయకులు కేసీఆర్ పాదాల దగ్గర బానిసలుగా మారారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యేలు, చింతల రామచంద్రారెడ్డి, ఎన్‌వీఎస్ ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామా రంగారెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేందర్‌యాదవ్, గౌతమ్‌రావు, శ్యామ్‌సుందర్‌గౌడ్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## దళితులు నిర్వహిస్తున్న ఆలయం రేకుల షెడ్డును తొలగించిన మున్సిపల్ అధికారులు

### నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్..



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు.. రేకుల షెడ్డులను కూల్చివేసిన మున్సిపల్ అధికారులు..

**నేరెడ్‌మెట్ అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ఓల్డ్ నేరెడ్‌మెట్‌లోని శ్రీ కాశీ విశ్వనాథ ఆలయం ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును ఆదివారం మల్కాజిగిరి మున్సిపల్ అధికారులు కూల్చివేసారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మల్కాజిగిరి మున్సిపల్ డీసి, టౌన్‌ప్లానింగ్, సిబ్బందితో కలసి ఆలయం ముందు ఉన్న రేకుల షెడ్డును కూల్చివేయడం జరిగిందన్నారు. 1925వ సంవత్సరంలో సామాజిక వర్గానికి చెందిన వారు ఈ ఆలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పటి నుండి దళిత వర్గానికి చెందిన వారే ఈ ఆలయాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఎమ్మెల్యేను ఆశ్రయించడం జరిగిందని, అయినప్పటికి అధికారులు ఏమాత్రం వినకుండా కూల్చివేతలు చేపట్టారని తెలిపారు. తాము ఆలయం ముందు అక్రమంగా రేకుల షెడ్డులను ఏర్పాటు చేయలేదని తమకు ఉన్న స్థలంలోనే షెడ్డులను ఏర్పాటు చేసినప్పటికి కూల్చివేతలు చేయడం ఏమాత్రం సరైంది కాదన్నారు. మున్సిపల్ అధికారులు కూల్చివేతలు చేయడం కారణంగా 2లక్షల రూపాయలు నష్టం జరిగిందని వెంటనే తమకు నష్టపరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేను ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వెంకట్రావు, రమేస్, లక్ష్మణరావు, రాజు, విజయ్ కుమార్, క్రిష్టారావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.